మండలి పోరుకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లలో అధికారులు
- కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

రాయదుర్గం: రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లను అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు. సార్వత్రిక ఎన్నికల్లా కాకుండా మండలి పోరుకు బ్యాలెట్ పత్రాలను వినియోగిస్తుండడంతో బూత్‌ల వద్ద ఓటర్లకు తెలిసేలా అభ్యర్థుల పేర్లు కలిగిన బ్యానర్లను ఏర్పాటు చేస్తున్నారు. డివిజన్‌లోని రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో 2 మున్సిపాల్టీలతో పాటు 11 మండలాలు ఉన్నాయి. వీటిలో 12,463 మంది పట్టభద్రులు, 780 మంది ఉపాధ్యాయ ఓటర్లు నమోదు కాబడ్డారు. అందుకు గాను 26 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ఎన్నికల సామగ్రిని సిబ్బందికి పంపిణీ చేయనున్నారు.

156 మంది సిబ్బంది నియామకం

డివిజన్‌లోని రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో మొత్తం నాలుగు జోన్‌లు వాటి పరిధిలోని 4 రూట్‌లను ఏర్పాటు చేశారు. అలాగే 26 మంది పీఓలు, ఏపీఓలు 78, ఓపీఓలు 52, సూక్ష్మ పరిశీలకులు 26 మందిని మొత్తం 156 మంది అధికారులను ఎన్నికల్లో బాగస్వామ్యం చేశారు.

కట్టుదిట్టమైన భద్రత

పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టనున్నారు. ఎన్నికల విధుల కోసం మొబైల్ పార్టీలు 4, స్ట్రైకింగ్ పార్టీ (ప్రతి మండలానికి ఒకటి చొప్పున) 11, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ నియోజకవర్గానికి ఒకటి చొప్పున 2, ఎంసీసీ బృందాలు 11, క్యూఆర్టీ పార్టీలు 2 నియమించారు. మొత్తంగా డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, ఏఎస్ఐ క్యాడర్ సహా మొత్తం పోలీస్ సిబ్బంది సుమారు 200 మందికిపైగా విధుల్లో పాల్గొననున్నారు.


కణేకల్లు మండలంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


శెట్టూరు పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రచారానికి తెర.. ప్రలోభాలకు ఎర

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రచారానికి తెరపడింది. ఈ కారణంగా ఓటర్లను ఆకట్టుకునేందుకు టీడీపీ నాయకులు ప్రలోభాలకు ఎర వేస్తున్నారు. గెలవక పోయినా కనీసం పోటీలోనైనా నిలుద్దామనే ఆలోచనకు వచ్చినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఓ వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమానికి తోడు లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఈ నెలాఖరు నాటికి ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపబోతున్నట్టు ఇది వరకే ప్రకటించారు. దీంతో చాలామంది బాహాటంగానే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతు పలుకుతుండడంతో టీడీపీ నాయకుల ముఖాల్లో డీలా కనిపిస్తోందని పలువురు మేధావులు పేర్కొంటున్నారు. సోమవారం పోలింగ్, 16వ తేదీ కౌంటింగ్‌కు కూడా ఏర్పాట్లు సిద్ధమయ్యాయి.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్



డివిజన్‌లోని మొత్తం 26 పోలింగ్ బూత్‌ల వద్ద పటిష్ట పోలీసు భద్రత ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఇరువైపులా 100 మీటర్ల దూరం పాటించేలా మార్కింగ్ వేయిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ కేంద్రాల వద్ద వ్యవహరిస్తూ లాఅండ్‌ఆర్డర్ దెబ్బతినేలా వ్యవహరిస్తే సత్వరం అరెస్టు చేసి కేసులు నమోదు చేయిస్తాం. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టాం.

– బీ శ్రీనివాసులు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి



పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకున్న వారంతా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థి ముందు ఏర్పాటు చేసి బాక్సుల్లో పైకి, కిందకు మార్కు తగలనీకుండా కేవలం ఒకటి అనే సంఖ్య మాత్రమే పెట్టాలి. రెండు, ఆ ఎంత మందికి ప్రాధాన్యత ఓటు వేసినా ఇన్‌వ్యాలిడ్ పట్ల జాగ్రత్త పడాలన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశాం. మద్యం దుకాణాలు కూడా మూయించేలా ఆదేశాలిచ్చాం.

– నిషాంత్‌రెడ్డి, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

ఎమ్మెల్సీ ఎన్నికలకు చురుగ్గా ఏర్పాట్లు

ఉరవకొండ: ఈ నెల 13న జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఉరవకొండ ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం తహసీల్దార్ సయ్యద్ షాబుద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ గురుప్రసాద్, సీఎస్‌డీటీ రమేష్‌బాబు పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ బూత్‌లను పరిశీలించి అందులో తాగునీరు, విద్యుత్ వసతులను పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న వారు ఓటరు స్లిప్‌తో పాటు ఎదైనా గుర్తింపు కార్డు తప్పకుండా తీసుకోరావాలన్నారు.

ఓటర్లకు గుర్తింపుకార్డు తప్పనిసరి

రాయదుర్గం/రాయదుర్గం రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు వచ్చేవారు తప్పనిసరిగా గుర్తింపుకార్డు వెంట తెచ్చుకోవాలని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సుజాత, తహసీల్దార్ మారుతి సూచించారు. శనివారం వారు వేర్వేరుగా మాట్లాడుతూ సోమవారం ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకూ పోలింగ్ ఉంటుందన్నారు. పోలింగ్ అధికారి అడిగినప్పుడు ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ఇతర ప్రైవేటు పారిశ్రామిక సంస్థలు జారీ చేసిన గుర్తింపు కార్డులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీ చేసిన గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తీసుకురావాలన్నారు. అలాగే ఉద్యోగం చేసే విద్యాసంస్థల గుర్తింపు, విశ్వ విద్యాలయాలు జారీచేసిన డిగ్రీ, డిప్లమా రిజినల్ సర్టిఫికెట్లు కూడా చెల్లబాటవుతాయన్నారు.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించి 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం వేడుకలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేసి, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు ఆమె తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

రాయదుర్గం: పట్టణంలోని వినాయక సర్కిల్ వద్ద ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నట్టు పార్టీ పట్టణ కన్వీనర్ ముస్తాక్ శనివారం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఉరవకొండ: కరోనాలాంటి విపత్కర పరిస్థితులు రాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని నిస్వార్థ సంస్థ వ్యవస్థాపకుడు వెంకట్ సూచించారు. శనివారం స్థానిక ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిస్వార్థ స్వచ్ఛంద సేవా సంస్థ 10వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాహిత ఈశ్వరీ బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయ నిర్వాహకురాలు పుష్ప, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ గణేష్‌బాబు, జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబుళేసు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి

కళ్యాణదుర్గం: పదో తరగతి విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని ప్రధానోపాధ్యాయుడు జి. శ్రీనివాసులు సూచించారు. శనివారం స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ ప్రేమావతి, వైస్ చైర్మన్ తిప్పస్వామి హాజరై విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు అందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాగన్న కుటుంబానికి అండగా ఉంటాం

వజ్రకరూరు: సీనియర్ పాత్రికేయుడు, కమ్యూనిస్ట్ నాయకుడు సి.నాగన్న కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి అన్నారు. మండలంలోని గూళ్యపాళ్యం గ్రామానికి చెందిన సి.నాగన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. శనివారం ఆయన గూళ్యపాళ్యం గ్రామానికి వెళ్లి నాగన్న కుటుంబాన్ని పరామర్శించారు. సర్పంచు కురుబ లక్ష్మయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ రాచన్నగౌడ్, ఆలయ క మిటీ సభ్యుడు నారాయణ, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి సామా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

ఉరవకొండ: చెట్టును కారు ఢీకొన్న ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన మేరకు... బళ్లారికి చెందిన న్యాయవాది సిద్ధార్థ్.. తన స్నేహితులు లింగరాజు, జమాలుద్దీన్, నాగరాజునాయక్‌తో కలసి కారులో శనివారం ఉదయం బెంగళూరుకు బయలుదేరారు. బూదగవి సమీపంలో 42వ జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో డ్రైవర్ దేవంద్రప్ప వేగాన్ని నియంత్రించుకోలేక రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ఘటనలో కారు కుడివైపు పూర్తిగా ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురూ తీవ్రంగా గాయపడ్డారు. లింగరాజు తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రులను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా బళ్లారిలోని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రాళ్లపల్లి అనంత కృష్ణశర్మకు నివాళి


రాళ్లపల్లిలో వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

కంబదూరు: సంగీత, సాహిత్య విద్వాంసుకుడు రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ 44వ వర్ధంతి ని మండలంలోని రాళ్లపల్లిలో శనివారం రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ అసోసియేషన్ సభ్యులు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్యామంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆదెప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు మారెప్ప, గంగాధర్, వెంకటరామిరెడ్డి, రవీంద్రారెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం

కళ్యాణదుర్గం: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేద్దామని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ సూచించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్‌ను గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు దాదాఖలందర్, నాగరాజు, ఎర్రిస్వామి, జియవుద్దీన్, ఫక్రుద్దీన్‌లతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటమి భయం పట్టుకుంది

- ప్రభుత్వ విప్ కాపు



రాయదుర్గం: ప్రజల్లో టీడీపీ విశ్వాసం కోల్పోయింది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును సామాన్య ప్రజలే నమ్మడం లేదు. సర్పంచులు, ఎంపీటీసీ, మున్సిపాల్టీల్లో జరిగిన వరుస ఎన్నికల్లో చావుదెబ్బ తీశారు. ఇక మేధావులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులెలా నమ్ముతారంటూ ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి మండిపడ్డారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు.. చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందన్నారు. ఒంటరిగా గెలిచే సత్తా లేకనే పీడీఎఫ్‌తో జతకట్టారని విమర్శించారు. రెండో ప్రాధాన్యత ఓటుపై ఒకరికొకరు సహకరించుకోవడం చూస్తే వారిలో అభద్రతా భావం ఎంతగా ఉందో అర్థమౌతుందన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కి ఓటర్లలో పెరుగుతున్న ఆదరణ చూసి ఆందోళన మొదలైందన్నారు. మాజీ మంత్రి కాలవ జిమ్మిక్కులను ఎవరూ నమ్మడం లేదన్నారు. ప్రజలకు మంచిచేసే ప్రభుత్వ పక్షానే మేధావులంతా నిలుస్తారన్నారు. అధికారంలో ఉన్ననాళ్లు దోపిడీకే పెద్దపీట వేస్తూ.. అన్ని వర్గాల ప్రజలను వంచనకు గురిచేసిన టీడీపీకి ఓటు అడిగే హక్కు లేదన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి కృషి..

రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బరిలో నిలిచిన వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి భారీ విజయానికి ప్రతి ఓటరూ కృషి చేయాలని విప్ కాపు రామచంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఒకే నోటిఫికేషన్ ద్వారా 1.35 లక్షల శ్యాశ్వత ఉద్యోగాలిచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు.

ఘనంగా దివానే పీరా ఉరుసు

కణేకల్లు: కణేకల్లులో ప్రాఖ్యాతి గాంచిన హజరత్ దివానేపీరా ఉరుసు శనివారం వైభంగా నిర్వహించారు. ఉరుసుకు భక్తులు పోటెత్తారు. దర్గాలో భక్తులు చెక్కర ఫాతేహాలు చేయించారు. అనేక మంది భక్తులు పూల చద్దర్‌ను పరిచి మొక్కుబడులను తీర్చుకున్నారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, నాయకులు మెట్టు విశ్వనాథరెడ్డి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, కార్యదర్శి ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, మండల అగ్రిబోర్డు చైర్మన్ ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి తదితరులు దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు చేయించారు.


దర్గాలో ఫాతేహాలు చేయిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

రాయదుర్గం/బొమ్మనహాళ్/విడపనకల్లు/వజ్రకరూరు: పట్టభద్రులు, ఉపాధ్యాయ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులైన వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమన్నారు.. టీడీపీ నాయకుల కల్లబొల్లి మాటలకు మోసపోవద్దని హితవు పలికారు. రాయదుర్గం పట్టణంలోని 11వ వార్డులో చేపట్టిన ఎన్నికల ప్రచారం లో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి పాల్గొనగా, వివిధ వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, కౌన్సిలర్లు పాల్గొన్నారు. అలాగే గుమ్మఘట్ట, డీ హీరేహాళ్, బొమ్మనహాళ్, రాయదుర్గం, కణేకల్లు మండలాల్లోనూ ఎంపీపీ, జెడ్పీటీసీ, మండల, సచివాలయాల కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీ, పార్టీ ముఖ్య నాయకులంతా ప్రచారం చేపట్టారు.

★ బొమ్మనహాళ్ మండలంలో నిర్వహించిన ప్రచారంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్ రెడ్డి, కోటేశ్వరరెడ్డి, రమేష్, యువరాజ్‌స్వామి, వన్నూరుస్వామి, రవి, ముక్కన్న, డాక్టర్ బసప్ప తదితరులు పాల్గొన్నారు.

★ విడపనకల్లు మండలంలో నిర్వహించిన ప్రచారంలో మండల సచివాలయ జేసీఎస్ కన్వీనర్ భరత్‌రెడ్డి, ఎంపీపీ కరణం పుష్పావతి, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు సుంకన్న, నాయకులు దేశాయ్ సిద్దార్థ, గడేకల్లు ఉమాశంకర్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

★ వజ్రకరూరు మండలంలో నిర్వహించిన ప్రచారంలో వైఎస్సార్‌సీపీ రైతువిభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, సర్పంచు మోనాలిసా, ఉపాధ్యక్షుడు ఉస్మాన్, మండల కార్యదర్శి నల్లబోతుల రాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాకెట్లబాబు, సచివాలయ కన్వీనర్ పట్టారాజు , ఎస్సీ సెల్ అధ్యక్షుడు కిరణ్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభుదాస్, బెస్త ఆది, సునీల్ త దితరులు పాల్గొన్నారు.

పాడి పశువుల పెంపకంపై శిక్షణ

గుమ్మఘట్ట: పాడి పశువుల పెంపకంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని పశువైద్యుడు నవీన్‌కుమార్ సూచించారు. మండలంలోని 75వీరాపురం గ్రామంలో కెనరా బ్యాంకు, ధర్మస్థల ట్రస్ట్, ఆర్డీటీ సంయుక్తంగా పాడి పోషణ పెంపకంపై రైతులకు శనివారం శిక్షణ కల్పించారు.

ఆవేశంలో కుప్పకూలి వ్యక్తి మృతి

రాయదుర్గం రూరల్: స్థానిక కోట ప్రాంతంలోని చాకలి వీధికి చెందిన దుగ్గిలమ్మ పూజారి నాయకుల మారెన్న (57) ఆవేశంలో కుప్పకూలి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మారెన్న కుమారుడు సుభాష్ వ్యసనాలకు బానిస కావడంతో శనివారం ఉదయం తండ్రి మందలించాడు. ఇది నచ్చని కుమారుడు ఆయనతో వాగ్వాదానికి దిగాడు. దీంతో మారెన్న ఆవేశానికి గురై ఒక్కసారిగా కుప్పకూలాడు. కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనకు సంబంధించి మారెన్న భార్య శీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కూడేరు: మండలంలోని జయపురానికి చెందిన ఆంజనేయులు కుమారుడు సతీష్(25) అనే వ్యక్తి అప్పుల బాధతో శుక్రవారం రాత్రి ఇంటి పక్కన ఉన్న పశువుల పాకలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడెకరాల పొలంలో పంటల పెట్టుబడికి చోళసముద్రం అనంత గ్రామీణ బ్యాంక్‌లో రూ.లక్ష క్రాప్ లోన్, ఇతరుల వద్ద రూ.2 లక్షల వరకు అప్పు చేసినట్లు మృతుడి అన్న శ్రీధర్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా మృతుడికి ఇంకా వివాహం కాలేదు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూడేరు మండలంలోని జల్లిపల్లి వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై శనివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంలో ఉన్న గుత్తి మండలం వన్నేదొడ్డికి చెందిన బాబు, ఉరవకొండ మండలం రాంపురానికి చెందిన ఎర్రిస్వామి తీవ్రంగా గాయపడ్డారు. వారిని తొలుత అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. మరో ద్విచక్ర వాహనంలో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

శుభకార్యం

వజ్రకరూరు: మండలంలోని కమలపాడు గ్రామంలోని ఈశ్వరమ్మ ఆశ్రమంలో శనివారం సర్పంచు కురుబ తిరకమ్మ, అల్లెప్ప దంపతుల కుమార్తె కావ్య (గీత)– హనుమంతరెడ్డి రిసెప్షన్‌ల వేడుకకు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి వై.ఉమాదేవి, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అంతకుముందు ఆశ్రమంలో ఈశ్వరీదేవి, సద్గురు శాంతానందస్వామి ఆలయాల్లో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాహనాల వేలం

ఉరవకొండ రూరల్: మండల సెబ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ఎనిమిది వాహనాలను శనివారం సెబ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు ఆధ్వర్యంలో వేలం వేశారు. జీఎస్టీతో కలుపుకుని రూ.2,74,468 ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు.

పశువులకు టీకాలు

గుమ్మఘట్ట: మండలంలోని గౌనిగుంట, జాలివంక గ్రామాల్లో 296 పశువులకు శనివారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యుడు నవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

15 నుంచి ఇంటర్ పరీక్షలు

రాయదుర్గంటౌన్: ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకూ నిర్వహించనున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన దాదాపు 1,114 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 467 మంది విద్యార్థులు, ఆదర్శ జూనియర్ కళాశాలలో 363 మంది, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 284 మంది విద్యార్థినులు పరీక్షలు రాయనున్నారు. 15న మొదటి సంవత్సరం విద్యార్థులకు 16న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయి. ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమం కాగా ప్రతి పరీక్ష గదిలోనూ సీసీ కెమెరా అమర్చారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయి. పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగానే విద్యార్థులు హాజరు కావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల కళాశాల, మోడల్ కళాశాల ప్రిన్సిపాళ్లు మురళి, జ్ఞానేశ్వర్, వెంకటేశులు సూచించారు. కాగా ఇంటర్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు రాయదుర్గంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయానికి చేరుకున్నాయి. పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు వాటిని పరిశీలించి స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు.

కుట్టు శిక్షణ కేంద్రం పరిశీలన

కుందుర్పి: మండల కేంద్రంలో అభయ ఫౌండేషన్ పర్యవేక్షణలో ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని జిల్లా కేంద్రానికి చెందిన మహిళా సంఘ సంస్కర్త వెన్నపూస కేశమ్మ పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నిర్మాహకుడు ఎస్‌కే లెనిన్‌బాబు, సభ్యులు ఉమాదేవి, సావిత్రమ్మ, శ్రీకాంత్, శిక్షకురాలు అంబుజా తదితరులు పాల్గొన్నారు.

కొనకొండ్లలో భారీ బందోబస్తు

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్లలో భారీ బందోబస్తు కొనసాగుతోంది. శుక్రవారం రాత్రి గ్రామానికి చెందిన రెండు వర్గాలు రాళ్లు రువ్వుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఘటనలో గాయపడిన ఇరువర్గాలకు చెందిన పలువురు స్థానిక పీహెచ్‌సీతో పాటు గుంతకల్లు, ఉరవకొండ సీహెచ్‌సీల్లో చికిత్స పొందుతున్నారు. ఘటనపై ఇరువర్గాలకు చెందిన 30 మందిపై కేసులు నమోదు చేసినట్లు వజ్రకరూరు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. కాగా, గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో శనివారం సైతం పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. గుంతకల్లు డీఎస్పీ నర్సింగప్ప గ్రామంలో పర్యటించి, పరిస్థితిని సమీక్షించారు.

క్షతగాత్రులకు పరామర్శ

ఉరవకొండ: వజ్రకరూరు మండలం కొనకొండ్లలో ఒకవర్గం జరిపిన దాడుల్లో తీవ్రంగా గాయపడి ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న దళితులను శనివారం ఎస్సీ, ఎస్టీ సంఘం రాష్ట్ర నేతలు పరామర్శించారు. ఎస్సీ, ఎస్టీ సంఘాల రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు సాకే హరి, దళిత, గిరిజన హక్కుల సాధన సమితి అధ్యక్షుడు మీనుగ గోపాల్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రాజు, మల్లికార్జున, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక అధ్యక్షులు రాజశేఖర్ పరామర్శించిన వారిలో ఉన్నారు. నాయకులు మాట్లాడుతూ దళితుల పై దాడి చేయడం దుర్మార్గమన్నారు. దాడి చేసిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ముందు జాగ్రత్తలతో మలేరియాను అరికట్టవచ్చు


బాలుర వసతి గృహంలో మలాథియన్ మందును పిచికారీ చేయిస్తున్న జిల్లా మలేరియా అధికారి

కూడేరు: ముందు జాగ్రత్తలు పాటిస్తే మలేరియాని అరికట్టవచ్చని జిల్లా మలేరియా అధికారి ఓబులు అన్నారు. శనివారం ఆయన కూడేరులోని బాలుర, బాలికల వసతి గృహాలను సందర్శించారు. అక్కడి పరిసరాలను పరిశీలించారు. దోమలు వృద్ధి చెందకుండా మలాథియన్ మందును పిచికారీ చేయించారు. వసతి గృహ పరిసరాల్లో నీటి నిలువలు, అపరిశుభ్రత లేకుండా చూసుకోవాలని వార్డెన్లు గురుప్రసాద్, మాధవికి సూచించారు. అనంతరం ఆయన మండలంలోని అరవకూరు, లెప్రసీ కాలనీల్లో పర్యటించి వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. పుట్టినప్పటి నుంచి 5 సంవత్సరాల వరకూ తప్పనిసరిగా నిర్ణయించిన మేరకు టీకాలు వేయించాలని, అపుడే పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి వ్యాధుల బారినపడకుండా రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మోహన్‌బాబు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మద్దయ్య, సూపర్‌వైజర్లు నూర్ బాషా, రవీంద్ర, వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు జయమ్మ, రాణి,ఏఎన్ఎంలు చంద్రకళ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకంతో ఆర్థిక పురోగతి


అప్పిలేపల్లిలో పండ్లతోటలను పరిశీలిస్తున్న ఎన్‌జీఓ ప్రతినిధుల బృందం

కుందుర్పి: పండ్లతోటల పెంపకంతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఆస్కారముందని తెలంగాణా అరుణ్య ఎన్‌జీఓ ప్రతినిధులు పద్మజ, నిషా తదితులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని అప్పిలేపల్లిలో ఆర్డీటీ సౌజన్యంతో మెట్ట భూముల్లో సేంద్రియ పద్ధతుల్లో సాగుచేసిన బహుళ రకాల పండ్లతోటలను వారు పరిశీలించారు. 70 శాతం సబ్సిడీతో వంద ఎకరాల్లో 20 మంది రైతులు ప్రయోగాత్మకంగా రూ.2 కోట్ల ఖర్చుతో పండ్లతోటల పెంపకం చేపట్టడం తెలిసిందే. అప్పిలేపల్లితో పాటు జంబుగుంపల, నిజవల్లి పంచాయతీల్లో సైతం ఆర్డీటీ రూ.16 కోట్లతో పండ్లతోటలు,పాడిపరిశ్రమ తదితర అభివృద్ధి పనులను చేపట్టి రైతుల ఆర్థిక పురోగతికి తోడ్పాటు నిస్తున్నట్లు ఆ సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ ఖలీల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ వ్యవసాయ శాఖ సిబ్బంది ఎరిస్వామిరెడ్డి, ఓబుళపతి, అరుణ్, విష్ణు, రైతులు అతావుల్లా, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు అందుబాటులో ఉండండి


విడపనకల్లు: వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వీరబ్బాయి

విడపనకల్లు/వజ్రకరూరు: రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని డీఎంహెచ్ఓ వీరబ్బాయ్ ఆదేశించారు. విడపనకల్లు మండలంలోని విడపనకల్లు, పాల్తూరు,పెద్దకొట్టాలపల్లి పీహెచ్‌సీలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు నిరంతరం అందుబాటులో ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. అలాగే ఉండబండలో సచివాలయాన్ని తనిఖీ చేశారు. విడపనకల్లులో వైద్య సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. మండల కేంద్రంలో రోగులకు ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ హరినాథ్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీధర్,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఆయన వజ్రకరూరు మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆస్పత్రి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలోని కాన్పుల గది, ఓపీ గదులు, వార్డులు, పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. అనంతరం వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. అలాగే మండలంలోని పందికుంట,ఎన్ఎన్‌పీతండా గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు సర్పంచు మోనాలిసా, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి నల్లబోతులరాజు తదితరులు డీఎంహెచ్ఓను సత్కరించారు. కార్యక్రమంలో డీఈఎంఓ భారతి, డిప్యూటీ డీఈఎంఓ త్యాగరాజు, వైద్యాధికారులు తేజస్వి, సర్దార్‌వలి, సీహెచ్ఓ గంగాధర్, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, సూపర్‌వైజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జీవాల్లో బ్రీడ్ సర్వే

బెళుగుప్ప: మండలంలోని హనుమిరెడ్డిపల్లిలో పశుసంవర్ధశాఖ ఉపసంచాలకుడు డాక్టర్ జి.వెంకటేష్ ఆధ్వర్యంలో మండల పశువైద్యాధికారి రమేష్ బ్రీడ్ సర్వే శనివారం నిర్వహించారు. ఉపసంచాలకుడు మాట్లాడుతూ బ్రీడ్ సర్వేను బెళుగుప్పలో ప్రయోగాత్మకంగా చేపడుతున్నామన్నారు. గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్ అందించి కృత్రిమ గర్భధారణ చేపడతామన్నారు. మేలు జాతిని అభివృద్ధి చేసే దిశగా పశువులకు కృత్రిమ గర్భధారణ వ్యాక్సిన్ అందిస్తున్నామన్నారు.